

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శనివారం సాయంత్రం నగరంలోని ఆయన నివాసంలో చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. **- చేవెళ్లటౌన్, డిసెంబర్ 16**

# జోన్ మార్పుతో ఉద్యోగావకాశాలు



అసెంబ్లీలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 16 : పరిగి నియోజకవర్గం పరిధిలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలు జోగులాంబ జోన్‌లో ఉన్నాయని, వాటితోపాటు కొడంగల్ నియోజకవర్గంలోని మండలాలను చార్మినార్ జోన్‌లోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి కోరారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో భాగంగా శనివారం పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. వికారాబాద్ ప్రాంతాన్ని ఎక్కడో ఉన్న జోగులాంబ జోన్‌లో వేశారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని, జోగులాంబ జోన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి వికారాబాద్ జిల్లాను చార్మినార్ జోన్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. ఇప్పటికీ పరిగి నియోజకవర్గంలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలు జోగులాంబ జోన్‌లో ఉన్నాయని, వాటితోపాటు కొడంగల్ నియోజకవర్గంలోని మండలాలను చార్మినార్ జోన్‌లోకి తీసుకురావాలని కోరారు. చార్మినార్ జోన్‌లో ఉండడంతో పరిగి ప్రాంతానికి చెందిన 47 మంది అభ్యర్థులు ఎస్సైలుగా ఎంపికయ్యారని తెలిపారు.

# నేర రహిత సమాజమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

- డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి
- విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాలి
- సివిల్ తగాదాల్లో తలదూరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు
- రాచకొండ కొత్త సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో/ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు నేర రహిత సమాజం కోసం పోలీసులు నిరంతరం కృషి చేయాలనేదే పోలీసుల ధ్యేయమని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. రాచకొండ కొత్త సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శనివారం తొలిసారిగా సీపీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో నేరాలను అరికట్టేందుకు పోలీసులు మరింత కృషి చేయాలని, నేరస్తులను పట్టుకోవడంలో, నేరపరిశోధనలో సాంకేతిక ఆధారాలతో పాటు సీసీ కెమెరాలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని ఆదేశించారు. రాచకొండ పరిధిలోని పాత నేరస్తుల కదలికల మీద నిరంతరం నిఘా పెట్టాలన్నారు. రోజువారీ పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని, ముఖ్యంగా విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఆదేశించారు.

**డ్రగ్స్ సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం**

డ్రగ్స్ రవాణా, వినియోగం, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను సీపీ సుధీర్‌బాబు ఆదేశించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగం లేకుండా సూక్ష్మ నిఘా పెట్టాలని ఆదేశించారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో జరిగిన ఈ సమావేశంలో రాచకొండ అదనపు కమిషనర్ తరుణ్ జోషి, సైబర్‌క్రైమ్ డీసీపీ అనురాధ, యాదాద్రి డీసీపీ రాజేశ్ చంద్ర, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, మల్కాజిగిరి డీసీపీ జానకి, రోడ్ సేఫ్టీ డీసీపీ శ్రీబాల, అడ్మిన్ డీసీపీ ఇందిర, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెకర్లు పాల్గొన్నారు.

**సివిల్ తగాదాల్లో తలదూరిస్తే చర్యలు తప్పవు**

పోలీసు అధికారులు, సిబ్బంది సివిల్ తగాదాల్లో తలదూర్చవద్దని, నిర్దిష్ట ఎస్‌వోపీ ప్రకారమే సివిల్ కేసుల విషయంలో నడుచుకోవాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ సుధీర్‌బాబు హెచ్చరించారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బంది తమ స్టేషన్ పరిధిలో ప్రతిరోజు కనీసం 15నిమిషాలు ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుని వారితో మమేకమవ్వాలని సూచించారు. పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా జవాబుదారితనంతో వ్యవహరించాలన్నారు. చట్టపరిధిలో, దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగానే నేర పరిశోధన జరగాలని, గరిష్ట శిక్షారేటు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

# హెల్ప్‌లైన్లను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లలితకుమారి

వికారాబాద్, డిసెంబర్ 16 : పిల్లలు, మహిళలు, వృద్ధుల హెల్ప్ లైన్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి (డీడబ్ల్యూవో) లలితాకుమారి అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని బూర్గుపల్లి పాత కలెక్టరేట్‌లో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మోమిన్‌పేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు మహిళా హక్కులు, చట్టాలు, పిల్లల హెల్ప్ లైన్ నంబర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బేటి బచావో.. బేటి పడావోలో భాగంగా ఆడపిల్లలను మనం కాపాడుకోవాలని, వారికి సరైన విద్య, వైద్యం అందించాలని సూచించారు. ఇందుకోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. పిల్లలు, మహిళలు వారికున్న హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.బలరాం, జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి , బాబు, ఫైనాన్షియల్ లిటరసీ రాందాస్, సఖి సెంటర్ అడ్మిన్ యశోద, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బాలమణి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వాటర్ సప్లై, యూజీడీ పనులు ప్రారంభం



వాటర్ సప్లై, యూజీడీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్

వికారాబాద్, డిసెంబర్ 16 : వికారాబాద్ పట్టణ అభివృద్ధిలో భాగంగా శనివారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు మధుకాలనీలో చైర్ పర్సన్ మంజులారమేష్ వాటర్ సప్లై, యూజీడీ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆమెతో పాటు వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, కౌన్సిలర్ బేగం, నాయకులు హసీబ్, దీపు, యాదగిరి, జంగయ్య, ఎక్బాల్, డీఈ, ఏఈ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

**ముజాహిద్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం**

కులకచర్ల, డిసెంబర్ 16 : కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

# అన్నను చంపిన తమ్ముడికి రిమాండ్

కొడంగల్, డిసెంబర్ 15 : పొలం అమ్మగా వచ్చిన డబ్బుల పంపకాల్లో తగాదా ఏర్పడి అన్నను గాయపరిచిన ఘటన ఈ నెల 13వ తేదీన చోటు చేసుకోగా 14వ తేదీన మృతి చెందడంపై హత్యకు కారణమైన వ్యక్తిని పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా శనివారం సీఐ రాములు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని రావులపల్లికి చెందిన మాల భీమప్పకు హన్మంతు, రాములు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల పొలం అమ్మగా వచ్చిన డబ్బుల పంపకం విషయంలో ఇరువురి మధ్య తరచూ గొడవ జరుగుతుండేది. ఈ నెల 13న తమ్ముడు రాములు చేతికర్రతో అన్న హన్మంతు తలపై బలంగా గాయపరిచాడు. దీంతో పరిస్థితి విషమంగా మారి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హన్మంతు ఈ నెల 14న మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాములను అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ వివరించారు.

# మేడిచెట్టు తండాలో భక్తిశ్రద్ధలతో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

బొంరాస్‌పేట, డిసెంబర్ 16: మండలంలోని మేడిచెట్టు తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వ ర్యంలో శనివారం హోమం, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు దంపతులు, తండా ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

# అడవీ జంతువులను వేటాడవద్దు

నవాబుపేట, డిసెంబర్ 16 : మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్న ఇద్దరి వ్యక్తులను పట్టుకుని అటవీ శాఖాధికారులకు అప్పగించిన వైనం శనివారం జరిగింది. అడవి జంతువులను ఎవరైనా వేటాడి చంపితే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్సై భరత్ భూషణ్ తెలిపారు. ఎందుకు వేటాడాల్సిన వచ్చిందో అటవీ శాఖాధికారులు విచారణ చేసి వివరాలు వెలడిస్తారని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**షెడ్లు లీజ్‌కు ఇవ్వబడును**
తక్కుగూడ ORR కు, శ్రీశైలం హైవే కు అతిదగ్గరలో ఉన్న కందుకూర్ మండలం జైత్వారం నందు 30 వేల Square ఫీట్స్ గల మూడు షెడ్లు ఉన్నాయి ఒక్క షెడ్ యొక్క విస్తీర్ణం 10 వేల Square ఫీట్‌లు ఉన్న షెడ్లు లీజ్‌కు ఇవ్వబడును.
—: సంప్రదించవలసిన నెంబర్లు :—
9440698772
7989508191

**SCHOOL BUILDING SALE**
★**Running School Building for Sale** in Armoor, District: Nizamabad, TS. Total Area 1600 Sq.yds., Total Slab Plinth Area 21000 Sft. Call: 7989918123.
**NT-313178-All**

**WANTED**
★**Wanted Data Entry Operators/** Electricians at Tukkuguda. Salary: Rs.10,000/- to 18,000/- per month. Call: 8143977213.
**NT-320786**

★**రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల** ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.
**NT-314474**

**పూజారి కావలెను**
★**సాయిబాబ దేవాలయంలో నిత్య పూజలు** చేయుటకు పూజారి కావలెను. మంచి జీతంతో పాటు వసతి కల్పించబడును. గ్రా॥ మైల్వార్, మం॥ బషీరాబాద్, జిల్లా VKB. సంప్ర: 9248186695.
**NT-317022**

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.